



కథ



# అన్యోన్య దంపతులు

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

రాత్రి తొమ్మిదిగంటలు...

ట్రైన్ తప్పిపోవడంతో సాగర్ నిరాశగా స్టేషన్ బయటకు వచ్చాడు. ఆ సమయంలో మరే రైలు లేనందువల్ల తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు. ఆటోలో ఇంటికి బయలుదేరాడు.

ఒక్కసారి భార్య ఇందుమతి గుర్తుకొచ్చింది.

మూడురోజుల క్యాంపుకు వెళతానంటే ఎంత బాధపడింది? తను క్యాంపులను తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు.

ఆటో దిగిన తర్వాత ఇంటిని సమీపించాడు.

లోపల బెడ్‌లైట్ వెలుగుతోంది.

'తొమ్మిదిగంటలకే ఇందుమతి నిద్రపోయిందేమిటి చెప్మా' అనుకుంటూ ఇంటి తలుపు తట్టబోయాడు.

లోపల్నుంచి సన్నని నవ్వులు వినిపించాయి.

గాజుల గలగలలు... చిన్నగా మాటలు.

సాగర్‌కు ఏమీ తోచలేదు. చెవులు రిక్కించి విన్నాడు. ఇందుమతి గొంతు ఎంతమందిలో వున్నా పోల్చగలడు. అయితే మరో వ్యక్తి ఎవరై ఉంటారు? ఆలోచనలకి అందలేదు.

మరో రెండు నిమిషాలకు ఆ విషయమూ తెల్సిపోయింది.

అతను ఎదురించి మేడమీద కొత్తగా దిగిన కాలేజీ కుర్రవాడు. రాజేష్.. ఈ మధ్య ఇందుమతి ఆగదివైపు చూసే చూపులకు అర్థం ఇప్పుడు బోధపడింది.

నిశ్శబ్దంగా సాగర్ వెనుదిరిగాడు.

మనస్సులో ఆందోళన... కసి...

ఎంతలా ప్రేమించాడు తను?... అడిగినది కాదనకుండా ఆమె కోర్కెలను, అవసరాల్ని తీర్చాడు... ఇందుమతి ఎందుకు అన్యాయం చేయాలనుకొంది?.... తనకన్నా రాజేష్‌లో కనిపించిన ప్రత్యేకత ఏమిటి?...

ఆలోచనలతో తల వేడెక్కిపోతుండగా సిన్మాహాల్లో దూరాడు. సినిమాలో హీరోయిను వెంటబడుతూ హీరో విరహగీతాలు పాడుతున్నాడు. మామూలప్పుడైతే ఆ సీన్లను ఎంజాయ్ చేసేవాడేమో కానీ మొదటిసారి భార్య మీద అసహ్యం వేసింది.

'ఎం ద్రోహం చేశావే ప్రేయసీ...' సాగర్‌లో బాధ, కసి, కోపం సుళ్లు తిరిగాయి.

అప్పుడే నిర్ణయించుకున్నాడు.

'ఇందుమతిని అంతం చేయాలి' అని.

000

ఇందుమతి ఆలోచిస్తోంది.

'తన బతుకు ఎందుకిలా అయిపోయిందా' అని బాధపడింది. ఎప్పుడూ క్యాంపులతో కాలాన్ని వెళ్లదీస్తూ, ఊరుకో అందగత్తెను ఉంచుకున్న సాగర్ తనకు భర్తగా లభించడం దురదృష్టమనే అనుకొంది.

ఏనాడైనా ప్రేమగా పిలిచాడా?

ఆప్యాయంగా పలకరించాడా?

ఎప్పుడూ చీదరింపులూ...ఛీత్కారాలు... విసుగు... కోపం... ఇవేనా తను కోరుకున్నది?

ప్రేమించిన రాజారావుతో పెళ్లి అయితే జీవితం ఎలా ఉండేది? 'అందమైన పూలపాన్పులా ఉండేదేమో' తీయని తలంపు ఇందుమతిని ఆనందపరవశురాల్ని చేసింది.

రాజారావు ఎంత మంచివాడు?

ఇంకా పెళ్లి చేసుకోలేదు... ఎప్పటికైనా తననే పెళ్లి చేసుకుంటాడంట. ఎంతటి విశాల హృదయం. ఇందుమతిలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

ఆ మధ్య రాజారావుతో ఓ రాత్రి గడిపింది.

తనతో వచ్చేయమన్నాడు.

"అమ్మో... సాగర్‌కు తెలిస్తే ఏమైనా ఉందా? దుర్మార్గుడు..."

"అందుకే నీ సుఖం నువ్వు చూసుకో... నీ ఆనందాన్ని పట్టించుకోని వాడు నీకు అనవసరం. అటువంటి దుర్మార్గుడి గురించి ఆలోచించకు.... అవసరమైతే అడ్డు తొలగించుకో..."

ఈ మాటలు ఇందుమతి మనస్సు మీద బాగా పనిచేశాయి. మొదటిసారి నిశ్చయించుకుంది 'సాగర్‌ని తన జీవితం నుంచి

తొలగించాలి. అదీ అనుమానం రాకుండా' అని.

అతని ఆస్తీ, అంతస్తు అన్నీ తన సొంతమవుతాయి. అప్పుడు స్వేచ్ఛా సామ్రాజ్యంలో ఆనందంగా విహరించవచ్చు... తను ప్రేమించిన... తనను ప్రేమిస్తున్న రాజారావును వివాహం చేసుకోవచ్చు.

ఇందుమతిలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

000

ఇందుమతిని చట్టానికి దొరక్కుండా తుద ముట్టించడానికి సాగర్ తీవ్రంగా ఆలోచించాడు. హత్య చేసినట్లు తెలిస్తే అందరికీ ప్రమాదం... ప్రమాదవశాత్తు చనిపోయిందని నిర్ధారించడానికి ఆధారాలు సంపాదించే వేటలో పడ్డాడు.

"ఇందూ! ఈ రోజు ఫస్టు షో సినిమాకి వెళదాం. సాయంత్రం తొందరగా వస్తాను. తయారై ఉండు" సాగర్ ఆఫీసుకు వెళుతూ అన్నాడు.

చనిపోయే చివరిరోజైనా ఆమెను సంతోషంగా ఉంచాలని... ఆమెకు ఆనందం పంచాలని అతని ఉద్దేశం.

సాగర్ ప్రపోజలు విని ఇందుమంతి ఆశ్చర్యపోయింది. 'ఏమిటీ ఎప్పుడూ లేని ప్రేమ ఈరోజు పుట్టుకొచ్చింది. కాలక్షేపానికి ఏ సుందరీ దొరకలేదు కాబోలు...' అనుకొంది.

'అవును. తను సాగర్‌తో సంతోషంగా ఉండాలి. తన పథకం అమలు జరపాలంటే ఎవరికీ అనుమానం రాకూడదు' నిశ్చయించుకుంది.

ఆ రోజుసాయంత్రం...

ఫస్టుషో సినిమాకు భార్యాభర్తలిద్దరూ కలిసే వెళ్లారు. హాల్లో సాగర్ కూల్‌డ్రింకు తీసుకొచ్చి ఇందుమతికి ఇచ్చాడు. వారానికి ఒకసారైనా ఇలా కలిసి సినిమా చూడాలని సాగర్ నుంచి హామీ కూడా పొందింది.

ఇద్దరి మనసుల్లోనూ ఒకరిమీద ఒకరికి చెప్పలేనంత కసి ఉంది. అయితే ఇద్దరు కూడా ఎక్కడా వ్యక్తం చేయలేదు.

సినిమా తర్వాత స్టార్‌హోటల్లో ఇద్దరూ కలసి భోజనం చేశారు. పార్లరుకు వెళ్లి ఐస్‌క్రీం తిన్నారు.

ఇంటికి వచ్చిన తర్వాత 'ఇదే చివరి రాత్రి' అని ఎవరు మటుకు వారు అనుకుని పడుకున్నారు.

000

మర్నాడు...

సాగర్ తన పథకానికి పూర్తిరూపం తయారుచేశాడు. కరంటువైరు తీసుకున్నాడు. దానిని ఓ పక్క స్విచ్‌బోర్డ్ కన్నంలో పెట్టాడు. తర్వాత స్విచ్ వేశాడు.

"ఇందూ! ఒక్కసారి ఇలారా!" ప్రేమగా పిలిచాడు. ఇందుమతి కాఫీ కలిపి తీసుకువచ్చింది. "మీ కోసమే స్పెషల్‌గా చేసాను. తాగండి" అంటూ టేబుల్ మీద పెట్టి దగ్గరికి వచ్చింది.

సాగర్ లిప్తపాటులో కరంటువైరును ఆమెకు తగిలించాడు. ఇందుమతి నోట్లోంచి అదోలాంటి అరుపు విన్పించింది. ఆమెకు జరిగినదేమిటో అర్థం కాకముందే శరీరం స్వాధీనం తప్పి దబ్బున పడిపోయింది.

సాగర్ వైరు తప్పించి ఆమె చేతిలో పెట్టాడు. కర్రలా బిగుసుకుపోయిన ఇందుమతి శవాన్ని చూస్తే కరంటుషాక్‌తో చనిపోయిందని ఎవరైనా ఖచ్చితంగా నమ్ముతారు.

సాగర్ మనసు సంతృప్తి పడింది.

మెల్లగా పక్కకి వచ్చి టేబుల్ మీద కాఫీ కప్పును అందుకున్నాడు.

రిలాక్స్‌గా కుర్చీలో కూర్చుని సిప్ చేశాడు.


కాఫీ రుచి గమ్మత్తుగా అన్పించింది.

ఆ తర్వాత క్రమంగా శరీరం అతని స్వాధీనం తప్పిపోయింది. కాఫీలో కలిపిన పవర్‌ఫుల్ నిద్రమాత్రలు తమ ప్రభావాన్ని చూపించాయి. కళ్లు మూతలు పడిపోయాయి. సాగర్ శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు.

000

'భార్య కరంటుషాక్‌తో మృతి చెందడం చూసి భర్త తట్టుకోలేకపోయాడు. భార్యలేని జీవితం వ్యర్థమని నిద్రమాత్రలు మింగి తను కూడా ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు... అన్యోన్య దంపతులు కథ ఇది' అంటూ మర్నాడు అనేక పత్రికలు వార్తాకథనాలు ప్రచురించాయి.

■



# వాస్తూ-వంటిల్లూ

భోజనం రుచిగా లేకపోతే కంచాలు విసిరేసే జనం వున్నారు. అసలు భోజనం రుచికరంగా తయారవాలంటే పాటించాల్సిన చిట్కా వుంది. ఇల్లాలు తూర్పు దిక్కుగా ముఖం చేసి వంట చేయాలట. కోడలెంత బాగా వంట చేసినా మెచ్చుకోని అత్తలున్నారు. లోపల్లోపలే ఆనందిస్తూ కడుపు నిండా తినటం తింటారు కానీ, ప్రశంసాపూర్వకంగా ఒక్కటంటే ఒక్క మాట కూడా అనదు అత్త. అత్త చేత ప్రశంసలు పొందాలంటే, వంటిల్లూ, నీటి వసతీ ఒకటే దిశలో వుండకూడదంటున్నారు. అలా వుంటే, ఇటువంటి సమస్యలు తలెత్తుతాయని వాస్తుశాస్త్రజ్ఞు లంటున్నారు. వాస్తే కాదు, ఫెంగ్ షుయి కూడా ఇదే చెబుతున్నది. పొయ్యి, సింక్ ఒకటే దిశలో వుండటం వల్ల అత్తకోడళ్ల మధ్య గొడవలు వుండుండి రాజుకుంటాయనీ, వాటిని అదుపులో వుంచేందుకు వంటింటినీ, పొయ్యినీ ఆగ్నేయదిశలోనూ, సింక్ మాత్రం ఉత్తరీపూర్వదిశ అంటే ఈశాన్యంగా అమర్చుకోవాలట. ఇందుకు కారణం నిప్పుకూ, నీటికీ వున్న వైరమే. పైగా ఆగ్నేయదిశలో నీటి వసతి వుంటే, ఆ ఇంట్లో వుండే జనానికి ఆత్మవిశ్వాసం కూడా తగ్గిపోతుందట. వంటింటి ప్రవేశద్వారం కూడా తక్కువేమీ తినలేదు. వంటింటి ద్వారం ఈశాన్యంగా వుంటే ఇంట్లో ధాన్యానికి ఎప్పుడూ కొరత వుండదు. అందువల్లే దక్షిణదేశంలో ఈశాన్యంగా అన్నపూర్ణాదేవి మందిరం నిర్మించుకునేవారు. కుటుంబసభ్యుల మీద రాహువు పట్టు తగ్గాలంటే కుటుంబంలోని అందరూ కనీసం రోజు కోసారైనా కలిసి వంటింట్లో భోజనం చెయ్యాలట. ఏ శాస్త్రం ఏమైనా చెప్పనీయండి, వీళ్లు చెప్పేది మాత్రం కుటుంబంలో సుఖశాంతులను కలిగిస్తుంది కనుక అందరూ పాటించొచ్చు.

ఎస్.